

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి
నామినేషన్ కార్యక్రమంలో నిర్మలాజగ్గారెడ్డి

టీపీసీసీ చీఫ్, మంత్రులతో కలిసి పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్


పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి నామినేషన్ ర్యాలీలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా సోమవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి కరీంనగర్‌లో నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి పాల్గొన్నారు. నామినేషన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన భారీ ర్యాలీలో వందలాది మంది కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు సీతక్క, కొండా సురేఖతో పాటు టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపు కోసం చిత్తశుద్ధితో పనిచేస్తామని పేర్కొన్నారు. ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త విజయం కోసం అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.


మంత్రులు కొండా సురేఖ, సీతక్కతో నిర్మలా జగ్గారెడ్డి

మంచుదుప్పటి..


చేర్యాల పట్టణంపై సోమవారం ఉదయం మంచుదుప్పటి పరుచుకుంది. ఉదయం 8-30గంటల వరకు పొగమంచు కురిసింది. మంచు దట్టంగా ఆవహించడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనపడక లైట్లు వేసుకుని వాహనదారులు ప్రయాణం సాగించారు. జనగామ-సిద్దిపేట జాతీయ ప్రధాన రహదారిని మంచు కమ్మేయడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

- చేర్యాల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి)

హుస్నాబాద్ బస్టాండ్ పరిసరాలను
పరిశీలించిన మంత్రి పొన్నం



హుస్నాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలను రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం పరిశీలించారు. అక్కడి చిరు వ్యాపారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు వైడింగ్‌లో కొంత భాగం పోయే షాపులను పరిశీలించారు. అనంతరం మహిళా ప్రయాణికులతో ముచ్చటించారు. పిల్లలను బాగా చదివించాలని సూచించారు. అంబేడ్కర్ చౌరస్తా సుందరీకరణ తదితర అంశాలను చర్చించారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, బంక చందు, వల్లపు రాజు, ఆక్టర్ అక్కు శ్రీనివాస్, పున్న సది తదితరులున్నారు.

ప్రత్యేకమా..
పొడగింపా?

- మూడు రోజుల్లో ముగియనున్న సహకార సంఘాల పాలకవర్గాల గడువు
- స్పెషలాఫీసర్ల నియామకానికి అధికారుల కసరత్తు
- పదవీకాలం పొడిగించాలని కోరుతున్న చైర్మన్లు
- ఆరు నెలల వరకు ఎన్నికలు అనుమానమే



మెదక్ అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రైతన్నలకు క్షేత్రస్థాయిలో అండగా నిలుస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాల పదవీకాలం మరో మూడు రోజుల్లో ముగియనుంది. ఇప్పటికే పంచాయతీ మండల, జిల్లా పరిషత్‌లు, మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. తాజాగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు సైతం ఈ జాబితాలో చేరనున్నాయి. కొత్త పాలకవర్గాల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. స్పెషలాఫీసర్లను నియమిస్తారా.. లేక పాత పాలకవర్గానికే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తారా అనే విషయంపై చర్చ సాగుతున్నది. ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించి ప్రస్తుతం సంగారెడ్డిలో డిస్ట్రిక్ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు(డీసీసీబీ) కొనసాగుతోంది. ఇటీవల ప్రభుత్వం కొత్తగా సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు స్వీకరించింది. కొత్త సంఘాలతో పాటు కొత్త డీసీసీబీలు ఏర్పాటు చేస్తారా.. లేదా ఉమ్మడి జిల్లాకు ఇప్పుడున్న దానినే కొనసాగిస్తారా అనేది తేలాల్సి ఉంది.

జిల్లా	సహకార సంఘాలు	సభ్యులు
మెదక్	57	76,765
సంగారెడ్డి	53	71,556
సిద్దిపేట	21	67,200

మార్గదర్శకాలు అందాల్సి ఉంది

సహకార సంఘాల ఎన్నికలపై మార్గదర్శకాలు అందాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా ప్రణాళికతో ముందుకు సాగుతాం. ఈ నెల 14తో పదవీకాలం ముగియనుంది. ప్రత్యేక అధికారిని నియమిస్తారా.. వారికే పర్సన్ ఇన్‌చార్జి ఇస్తారా అనేది ఆదేశాలు రాలేదు. కొత్త సంఘాల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటాం.

-కరుణాకర్, మెదక్ జిల్లా ఇన్‌చార్జి సహకార అధికారి

14న ముగియనున్న పదవీకాలం

పీఏసీఎస్‌ల పాలకవర్గాలను ఎన్నుకునేందుకు 2020 ఫిబ్రవరి 14న ఎన్నికలు నిర్వహించారు. అదే నెల 25న డీసీసీబీ, డీసీఎంఎస్ డైరెక్టర్లు, చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకున్నారు. వారి పదవీకాలం ఈ నెల 14తో పూర్తవుతుంది. సాధారణంగా సొసైటీల కాలపరిమితి ముగియడానికి ఆరు నెలల ముందుగానే ప్రభుత్వం ఎన్నికల ప్రక్రియను ప్రారంభించి గడువు వరకు ముగిసే లోపు పూర్తిచేసేది. కానీ, ప్రస్తుతం వీటి నిర్వహణపై ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేదు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహించే పరిస్థితి కూడా కనిపించడం లేదు. ప్రత్యేకాధికారుల పాలన అనివార్యంగా మారింది. మరోవైపు పలువురు అధికార పార్టీ డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు తమ పదవీకాలాన్ని పొడిగించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో పాలకవర్గాల

మిగతా 7వ పేజీలో..


కొమురవెల్లిలో సంచరిస్తున్న కుక్కల గుంపు

కొమురవెల్లిలో కుక్కల దాడి

- ముగ్గురు చిన్నారులకు గాయాలు

చేర్యాల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లిలో కుక్కలు దాడి చేసిన ఘటనలో ముగ్గురు చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఇరువురు కొమురవెల్లి మల్లన్న దర్శనానికి వచ్చిన పొరుగు జిల్లాలకు చెందిన భక్తులుండగా, మరో స్థానిక బాలుడికి గాయాలయ్యాయి. కొమురవెల్లిలో కొన్నాళ్లుగా కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. కాలినడకన వెళ్లినా, వాహనాలపై ప్రయాణించినా వెంబడిస్తూ దాడికి యత్నిస్తున్నాయి. నాలుగోవారం జాతర సందర్భంగా మల్లన్న దర్శనార్థం భక్తులు ఆదివారం భారీగా తరలివచ్చిన క్రమంలో పెద్దసముద్రాలకు చెందిన పలువురు భక్తులు ఆలయ పరిసరాల్లో బస చేశారు. ఈ క్రమంలో కుక్కలగుంపు చేరి ఓ బాలిక, బాలుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. అంబేడ్కర్ కూడలి వద్ద గ్రామానికి చెందిన వడ్లూరి శ్రీనిధ్‌పై దాడి చేశాయి. నోటిభాగంలో కరవడంతో గాట్లుపడి రక్తస్రావం జరిగింది. చికిత్స నిమిత్తం సిద్దిపేట ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. ఒకేసారి ముగ్గురు చిన్నారులు గాయపడడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మల్లన్న భక్తులతో పాటు గ్రామంలో నెలకొన్న కుక్కల బెడద తీర్చాలని కోరుతూ స్థానిక యువకులు, ఏర్పుల మహేశ్, సనాది కరుణాకర్, గొల్లపలిల ఆంజనేయులు, గజ్జె అశోక్, ఏర్పుల శ్రీనివాస్, సార్ల వినయ్, పొట్ల చెరువు బాబు, కొయ్యడ సంజీవులు తదితరులు గ్రామపంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్‌కు వినతిపత్రం అందించారు.

నిద్రమత్తు వీడింది..
విగ్రహాలకు ముసుగు పడింది

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



సిద్దిపేటరూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి); ఎట్టకేలకు అధికారులు నిద్రమత్తు వీడారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేశారు. ఉమ్మడి మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వచ్చి పది రోజులు గడుస్తున్నా అధికారులు ఇంకా నిద్రమత్తు వీడలేదంటూ 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి సిద్దిపేట రూరల్ , నారాయణరావుపేట మండల అధికారులు స్పందించారు. ఆయా గ్రామాల్లో ప్రధాన చౌరస్తాల్లో ఉన్న రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని, ఎక్కడ నిర్లక్ష్యంగా వ్యవహరించినా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి సిబ్బందికి హెచ్చరించినట్లు సమాచారం

రైస్ మిల్లు సంపులో పడి
అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

7



కొర్రీ.. వర్రీ..

- కందుల కొనుగోలులో కిరికిరి
- నిబంధనలతో పేరుతో నిరాకరణ
- సేకరణతో తంటాలు

8

ప్లాస్టిక్ రహిత పట్టణంగా
తీర్చిదిద్దుకుందాం

- వ్యాపారులతో సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

8


వర్గల్ నవోదయలో పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని తిలకిస్తున్న విద్యార్థులు

పరీక్షా పే చర్చను తిలకించిన
వర్గల్ నవోదయ విద్యార్థులు

వర్గల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నిర్వహించిన పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని సోమవారం వర్గల్ నవోదయ విద్యాలయంలో విద్యార్థులు తిలకించారు. నవోదయ విద్యాలయం ఎంపీ హాల్లో ప్రధాన మంత్రి ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు తిలకించడం కోసం ఏర్పాటు చేసినట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా పరీక్షలపై విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు నరేంద్ర మోదీ తనదైన శైలిలో సమాధానం ఇచ్చి ఆకట్టుకున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఎనిమిదేళ్లుగా ప్రతీ నెలా జనవరిలో నిర్వహించే కార్యక్రమాన్ని విద్యార్థులు వీక్షించేలా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో విద్యాలయం ఉపప్రధానోపాధ్యాయులు రమేశ్ అంచురి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా విద్యాధరి క్షేత్ర వార్షికోత్సవాలు



వర్గల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అత్యంత ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వర్గల్ విద్యాధరి క్షేత్రంలో విద్యా సరస్వతీ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలను సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ వ్యవస్థాపకుడు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో అమ్మవారికి విశేష పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ యాగశాలలో ఆలయ వేద పండితుల వేదమంత్రోశ్చరణల మధ్య చండీహోమం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

ఎన్నికలను సజావుగా నిర్వహించాలి

- రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలి
- కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేటకలెక్టరేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలను తప్పకుండా పాటించాలని కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనుచౌదరి సమక్షంలో జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, డిస్ట్రిక్ మేనేజర్ ఆనంద్, గ్రామపంచాయతీ మొదటి విడత, రెండో విడత ఎన్నికల పోలింగ్ అధికారులు, ఇతర అధికారులను మండలాల వారీగా ర్యాండమైజేషన్ నిర్వహించారు. మొదటి విడత 14 మండలాలకు 2,750 మంది పోలింగ్ అధికారులు, 3,342 మంది ఇతర పోలింగ్ అధికారులను కేటాయించారు. రెండో విడత 12 మండలాలకు 2659 మంది పోలింగ్ అధికారులు, 3,115 మంది అదర్ పోలింగ్ అధికారులు మొత్తం 11,867 మంది అధికారులను కేటాయించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఎన్నికల మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, విద్యాశాఖ సెక్టోరల్ అధికారి రామస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.


ఎన్నికలకు సంబంధించి సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

హైవే పనులను త్వరగా పూర్తిచేయాలి

నేషనల్ హైవే పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ మనుచౌదరి నేషనల్ హైవే అధికారులు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సోమవారం నేషనల్ హైవే ఇంజనీర్, కాంట్రాక్టర్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. మెదక్-ఎల్కతుర్తి నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా సిద్దిపేట నుంచి జిల్లా పరిధి చివరి ప్రాంతం వరకు నేషనల్ హైవే నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. సమావేశంలో హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి, హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, నేషనల్ హైవే ఏఈలు అనురాగ్, శ్రీనివాసరావు, కాంట్రాక్టర్ చందు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం చేపట్టాలి

జిల్లాలో 26 మండలాల్లో ఎంపిక చేసిన ఒక్కో గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేసిన వారి ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఎంపీడీవో, పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ ఇంజనీర్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. మండలానికో మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి స్థల సేకరణ చేసి నిర్మాణం త్వరగా పూర్తి చేసేలా చూడాలని తెలిపారు. సమావేశంలో హౌసింగ్ పీడీ దామోదరరావు, డీఎంహెచ్‌వో పల్వన్‌కుమార్, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, డీఈ చిరంజీవులు పాల్గొన్నారు.

'టెలిమాస్'తో విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి దూరం

- కౌన్సెలింగ్ కోసం 14416 టోల్‌ఫ్రీ నంబర్
- జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి

దుబ్బాక, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇంటర్ విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా హెల్ప్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో టెలిమాస్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఒత్తిడిగా భావించే విద్యార్థులు వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 14416కు కాల్‌చేయాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం దుబ్బాకలోని జూనియర్ కళాశాలలను ఆయన సందర్శించారు. జిల్లాలో 62 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నాలుగు విడతల ఇంటర్ ప్రయోగ పరీక్షలను పారదర్శకంగా, నిఘా నేత్రాల ద్వారా నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో 11,090 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు తెలిపారు. విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడకుండా తగిన చర్యలు చేపట్టామన్నారు. విద్యార్థులు పూర్తిస్వేచ్ఛగా, ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా సన్నద్ధం చేశామని తెలిపారు. కళాశాలల్లో మానసిక వైద్యులతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామని అంతేగాక టెలిమాస్ ద్వారా పూర్తి స్థాయి కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. ఆయన వెంట డీఈసీ సభ్యులు గంగాధర్, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఇంగు శివకుమార్ తదితరులున్నారు.

రాజగోపాల్‌పేటలో సెంట్రల్ లైటింగ్
ఏర్పాటుకు కేంద్రం ఆమోదం

- ఎమ్మెల్యే హరీశ్ లేఖకు స్పందించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కారీ

నంగునూరు, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట-ఎల్కతుర్తి జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా సిద్దిపేట నియోజకవర్గంలోని నంగునూరు మం డలం రాజగోపాలపేట వద్ద సెంట్రల్ లైటింగ్, ఫుట్ పాత్‌తో కూడిన డ్రైయినేజీ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇటీవల మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు కేంద్ర మంత్రి నితిన్ గడ్కారీకి లేఖ రాశారు. స్పందించిన కేంద్ర మంత్రి జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రాజగోపాలపేటలో సెంట్రల్ లైటింగ్, డ్రైయినేజీ సిస్టం తో ఫుట్‌పాత్ నిర్మాణం శరవేగంగా చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు హరీశ్‌రావుకు తిరిగి లేఖ రాశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్‌రావు కేంద్రమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామంలో ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకొని లేఖ రాసిన మాజీ మంత్రి హరీశ్‌రవు, కేంద్రమంత్రి గడ్కారీకి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు



గడ్డివాములు దగ్ధం

రాయపోల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రెండు గడ్డివాములు దగ్ధమైన సంఘటన రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపల్లికి చెందిన నామసాని ఆంజనేయులు, నామసాని సదానందం వారి ఇంటి సమీపంలో పశువుల మేత కోసం రెండు గడ్డివాములను వేసుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న వారు మంటలను అదుపులోకి తెచ్చారు. ఎవరో కావాలని గడ్డివాములకు నిప్పు పెట్టారని, రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితులు పేర్కొన్నారు.

ఏటీఎం కార్డు మార్చి డబ్బులు డ్రా

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మల రామారం గోవింద్ తండాకి చెందిన మేఘవత్ దశరథ్ గజ్వేల్ పట్టణంలోని ఆర్అండ్ఆర్ కాలనీ పల్లెపహాడ్‌కు చెందిన తిరుపతి ఇంటికి వచ్చాడు. డబ్బులు అవసరం ఉండి తిరుపతికి చెందిన ఏటీఎం కార్డును దశరథ్ తీసుకుని గజ్వేల్ పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంక్ ఏటీఎంలో డ్రా చేసేందుకు వెళ్లి అక్కడే ఉన్న వ్యక్తిని డ్రా చేయమని అడిగాడు. డ్రా చేసిన తర్వాత అతడు కార్డును మార్చి ఇచ్చాడు. అనంతరం సదరు వ్యక్తి ఆ ఏటీఎం కార్డుతో రూ.16600 వేలు డ్రా చేశాడు. దీంతో బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

క్రైం కార్నర్

రైస్‌మిల్లు సంపులో పడి అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



రైస్‌మిల్లు వద్ద మృతదేహంతో ఆందోళన చేస్తున్న బంధువులు



కృష్ణ(ఫైల్)

అల్లాదుర్గం, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి) : రైస్‌మిల్లులో యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన సంఘట అల్లాదుర్గం మండలం రాంపూర్‌లో సోమవారం చోటుచేసుకున్నది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గోండ కృష్ణ(28) రైస్‌మిల్లులో ఏర్పాటు చేసిన సంపులో పడి ఉండగా అక్కడున్న కొందరు వ్యక్తులు అతడిని వైద్యపరీక్షల కోసం తరలించేందుకు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ చేరుకునేలోపే కృష్ణ మృతి చెందాడు. అయితే, కృష్ణకు ఈత వస్తుందని అతడు సంపులో పడినా సురక్షితంగా బయటపడే అవకాశం ఉన్నప్పటికీ మృతిచెందడం అనుమానాలకు తావిస్తుందని గ్రామస్థులు సందేహం వ్యక్తం చేశారు. కృష్ణకు భార్య సావిత్రి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రైస్‌మిల్లు వద్ద కృష్ణ భార్య, బంధువులు ఆందోళన నిర్వహించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు విచారణ చేపట్టారు.

మంజీరాలో దూకి ఒకరి ఆత్మహత్య



రమేశ్ మృతదేహం

చిలప్‌చెడ్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మంజీరా నదిలో దూకి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చిట్కుల్ గ్రామ శివారులోని చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చండూరు గ్రామానికి చెందిన గుడ్డనొల్ల రమేశ్(38) ఛాముండేశ్వరి ఆలయ సమీపంలోని మంజీరా నదిలో దూకగా, అదేగ్రామానికి చెందిన వ్యక్తి గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికులతో వెతికించగా, ఫలితం లేకపోయే సరికి మెదక్ నుంచి గజఈతగాళ్లను రప్పించారు. రాత్రి వరకు రమేశ్ మృతదేహం లభించగా, పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రమేశ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని అతని ఆత్మ హత్యకు గల కారణాలు తెలియాల్సిఉందని, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చెరువులో దూకి వృద్ధుడు..

చేగుంట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చేగుంట మండల పరిధిలోని కర్నాల్‌పల్లి గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకున్నది. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొప్పులపల్లి బాలయ్య(79) ఆరేళ్లగా దగ్గుదమ్ముతో బాధపడుతూ ఆర్వీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎంతకూ నయం కాకపోవడంతో ఆదివారం పొలం వద్దకు వెళ్లొస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి, తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికారు. సోమవారం ఉదయం గ్రామ సమీపంలోని పెద్దచెరువు వద్ద చెప్పులు, సెల్‌ఫోన్ కనిపించడంతో చెరువులో వెతకగా మృతదేహం లభ్యమైంది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఆసుపత్రికి తరలించి ఎస్‌ఐ వెల్లడించారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి



అనిరుధ్ మృతదేహం

పాపన్నపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో బాలుడు మృతిచెందిన సంఘటన ఢాక్యా తండా గ్రామపంచాయతీ పరిదిలోని ధనూజతండాలో ఆదివారం రాత్రి చోటుచేసుకున్నది. ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం.. పాపన్నపేట మండల పరిధిలోని నర్సింగ్‌రావుపల్లి తండాకు చెందిన కేతావత్ లక్ష్మణ్ పెద్ద కుమారుడు అనిరుధ్(5) ఆదివారం లక్ష్మణ్ బావమరిది నిశ్చితార్థం నిమిత్తం ఇదే మండలం ధనుజాతండాకు వెళ్లారు. అనిరుధ్ స్పీకర్ బాక్సుల ఆటో వద్ద ఉన్న ఓ వైర్‌ను చూడకుండా కాలు పెట్టడంతో విద్యుదాఘాతానికి గురైకిందపడ్డాడు. కుటుంబీకులు గమనించి మెదక్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతి చెందిన బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

అధికారుల ఒత్తిడితో మున్సిపల్ ఔట్‌సోర్స్ ఉద్యోగి ఆత్మహత్య?

- సెల్‌ఫోన్‌లో కీలక విషయాలు
- అధికారులను విచారిస్తున్న పోలీసులు

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 10 : మెదక్ మున్సిపల్ అధికారుల వేధింపులతోనే ఔట్‌సోర్స్ ఉద్యోగి సంజీవ్ ఆత్మహత్య చేసుకున్నాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. పదేళ్ల నుంచి విధులు సంజీవ్‌ను మూడు నెలల క్రితం డంపింగ్‌యార్డులో విధులు నిర్వహించాలని మున్సిపల్ అధికారులు ఆదేశించారు. డిసెంబర్ 31న విధులకు వెళ్లిన అతను ఇంటికి రాకపోవడంతో జనవరి 1న డంపింగ్‌యార్డుకు వెళ్లి చూడగా ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. అతని సెల్‌ఫోన్‌లో దొరికిన వివరాలతో పోలీసులు చర్యలకు సిద్ధమయ్యారు. ముగ్గురు మున్సిపల్ శానిటేషన్ అధికారులను పోలీసులు సోమవారం సాయంత్రం విచారణకు తీసుకెళ్లి పంపించినట్లు తెలిసింది. బలవంతంగా డంపింగ్‌యార్డులో విధులపై తనను ముగ్గురు అధికారులు ఇబ్బంది పెడుతూ డబ్బు అడిగినట్లు ఆ వీడియోలో ఉందని కుటుంబసభ్యుల ద్వారా తెలిసింది.

తలో చేయి వేసి.. తళుక్కుమనిపించి

కళాశాల అందంగా, ఆహ్లాదంగా కనిపించాలంటే తలో చేయి వేయక తప్పదని గ్రహించారు కల్హేర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు. అనుకున్నదే తడవుగా రూ.5 వేలు వేసుకుని కళాశాలకు పెయింటింగ్ వేయించి తళుక్కుమనిపించేలా చేశారు. కల్హేర్ జూనియర్ కళాశాల అధ్యాపకుల ఆలోచనను స్థానికులు అభినందిస్తున్నారు.

- కల్హేర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి)



నాడు - నేడు



తైబజార్ వసూళ్లలో చేతివాటం

- టెండర్లు వేయడానికి ముందుకు రాని కాంట్రాక్టర్లు
- సంగారెడ్డి మున్సిపల్ ఆదాయానికి గండి

సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మున్సిపల్ పరిధిలోని సంతలు, మార్కెట్లలో తైబజార్ వసూళ్లలో బల్దియా సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. పట్టణంలో వారానికి నాలుగు సంతలతో పాటు గంజిమైదాన్, పాత బస్టాండ్ ప్రాంతాల్లో మార్కెట్లలో తైబజార్ కింద ఫీజులు వసూలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం తైబజార్ వసూళ్ల ప్రక్రియను టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగించాల్సి ఉంటుంది. సంగారెడ్డిలో మాత్రం అందుకు భిన్నంగా సాగుతున్నది. మున్సిపల్ అధికారులు టెండర్లు పిలిచినప్పటికీ, కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో సిబ్బంది ద్వారానే వసూలు చేయిస్తున్నారు. సదరు సిబ్బంది తైబజార్ వసూళ్లలో అందినకాడికి దండుకుంటున్నారు.

ముందుకు రాని కాంట్రాక్టర్లు

కరోనా కారణంగా 2021లో తైబజార్ వసూలు చేయలేదు. 2020 మార్చి నెలలో టెండర్లు పిలువగా, ఓ కాంట్రాక్టర్ రూ.23 లక్షలకు దక్కించుకున్నప్పటికీ, మునిసిపల్‌కు ఒక్క పైసా చెల్లించలేదు. 2022-23, 2023-24 సంవత్సరాలలో మరోసారి టెండర్లు పిలిచినప్పటికీ, కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. 2024లో మూడోసారి టెండర్లు పిలవగా ఎవరూ ఆసక్తి చూపలేదు. మున్సిపల్ అధికారులు నిర్ధేశించిన లక్ష్యంగా భారీగా ఉండడంతో కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

దండుకుంటున్న సిబ్బంది

కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో మున్సిపల్ సిబ్బంది, బిల్ కలెక్టర్ల



ద్వారా వసూలు చేయిస్తున్నారు. ఇది సిబ్బందికి కల్పవృక్షంగా మారింది. ఫీజులు ఇష్టానుసారంగా వసూలు చేస్తూ, అందులో నుంచి అందినకాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పట్టణంలో ఆదివారం, సోమవారం, గురువారం, శుక్రవారం రోజుల్లో వారానికి నాలుగు రోజులు సంతలు జరుగుతున్నాయి. వీటితో పాటు గంజిమైదాన్, రైతుబజార్, పాత బస్టాండ్ వద్ద దుకాణ సముదాయాల్లోనూ తైబజార్ ఫీజులు వసూలు చేస్తున్నారు. ఒక్క సంతలో రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన నాలుగు సంతలు, దుకాణ సముదాయాల నుంచి నెలకు రూ.2 లక్షలకు పైగా మున్సిపల్ ఖజానాకు రావాల్సిన ఉన్నది. అయితే, సిబ్బంది చేతివాటాన్ని ప్రదర్శిస్తూ ఒక్కో సంతలో కేవలం రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు మాత్రమే చెల్లిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ అధికారులు నిర్ధేశించిన ధరల కంటే అధికంగానే వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. అయినా, ఖజానాకు చేరడం లేదు. గతంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తైబజార్‌లో జరుగుతున్న అక్రమాలపై పలువురు కౌన్సిల్ సభ్యులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

పొలాలకు దారి వదలండి.. లేదంటే భూములు తిరిగిచ్చేయండి

- కంపెనీ పనులను అడ్డుకున్నరైతులు

తూప్రాన్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పొలాలకు వెళ్లేందుకు దారి వదిలాలని, లేదంటే తాము కంపెనీకి ఇచ్చిన భూములను తిరిగిచ్చేయాలని తూప్రాన్ మండలం మజీద్‌పల్లి(ఎస్‌కే)లో రైతులు సోమవారం పరిశ్రమ నిర్మాణ పనులను అడ్డుకుని ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. మనోహరాబాద్ మండలం కొండాపూర్ శివారులోని అసైన్డ్ భూములను సేకరించి, టీజీఐఐసీ పరిశ్రమలకు కేటాయించింది. ముప్పిరెడ్డిపల్లి, కొండాపూర్ గ్రామాల పక్కనే ఉన్న తూప్రాన్ మండలం మజీద్‌పల్లి(ఎస్‌కే)లో ముప్పిరెడ్డిపల్లి గ్రామ రైతులకు వ్యవసాయ భూములున్నాయి. ఆ భూముల్లోకి వెళ్లేందుకు నక్షా దారి ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. భూసేకరణ చేపట్టిన రెవెన్యూ అధికారులు ఇష్టానురీతిగా సర్వేలు నిర్వహించి నక్షా దారి సైతం లేకుండా చేసినట్లు రైతులు ఆరోపించారు. ఓ పరిశ్రమ యజమానికి నక్షా దారి ఉన్న భూమి సైతం కేటాయించడంతో నిర్మాణ పనులు చేపట్టారు. దాంతో సోమవారం రైతులు అక్కడకు వెళ్లి ఆందోళన చేపట్టారు. పనులను అడ్డుకుని దారి వదలాలని కోరారు. తమకు టీజీఐఐసీ భూమిని కేటాయించి, చూపించిన నక్షా ప్రకారం నిర్మాణం చేస్తున్నట్లు కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా



కంపెనీ నిర్మాణ స్థలిలో ఆందోళన చేస్తున్న రైతులు

పొలాల వద్దకు వెళ్లే రహదారిని లేకుండా చేస్తున్నారని, కంపెనీ నిర్మాణం చేస్తే తామెలా వెళ్లాలని మండిపడ్డారు. దారి వదలకుంటే కంపెనీలకు సేకరించిన భూములను తిరిగి ఇచ్చేయ్యాలని రైతులు డిమాండ్ చేశారు. సుమారు 40 ఎకరాల భూముల్లోకి దాది ఉండదని, టీజీఐఐసీ అధికారులు స్పందించి దారి చూపాలని రైతులు కోరారు.

విమాన భద్రతలో ట్రాఫిక్, మానవ తప్పిదాలే ముఖ్య సమస్యలు

- ఐఐటీ హైదరాబాద్ సాంకేతిక అధికారి డాక్టర్ ఎంవీ సత్యానంద్



మాట్లాడుతున్న సత్యానంద్

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విమానయాన భద్రతలో పెరుగుతున్న ట్రాఫిక్, మానవ తప్పిదాలు ముఖ్య సమస్యలుగా నిలుస్తున్నాయని ఐఐటీ హైదరాబాద్ విశిష్ట సాంకేతిక అధికారి డాక్టర్ ముట్నూరి వెంకట సత్యానంద్ అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఏరోస్పేస్ విభాగం ఆధ్వర్యంలో 'ఎయిర్ క్రాఫ్ట్ స్ట్రక్చరల్ సిస్టమ్ హెల్త్ మేనేజ్మెంట్, అడ్వాన్స్‌డ్ ఎయిర్ మొబిలిటీ' అనే అంశంపై సోమవారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. తక్కువ, అధిక ఎత్తులో ఉన్న ఎయిర్ స్పేస్ ఆపరేషన్‌లకు సంబంధించిన డయాగ్నస్టిక్స్, ప్రోగ్నోస్టిక్స్ పద్ధతులపై విలువైన సమాచారాన్ని తెలిపారు. సవాళ్లను అధిగమించడానికి వినూత్న పరిష్కారాల అవసరాన్ని నొక్కి చెప్పారు. సమర్థవంతమైన ఎయిర్ ట్రాఫిక్ నిర్వహణ చాలా అవసరమని స్పష్టం చేశారు. విజయవాడలో ఇటీవల సంభవించిన ఆకస్మిక వరదలు, డ్రోన్లు పోషించిన పాత్ర, వాటి విజయాలు, పరిమితులు, సాంకేతికతల ప్రభావంపై కేస్ స్టడీలను ఆయన విద్యార్థులతో పంచుకున్నారు. డేటా ఉన్నప్పుడు, కృత్రిమ మేధస్సు ఉంటుందని, సమాచార యుగంలో, మీరు ఏ డేటాను ఉత్పత్తి చేయబోతున్నారు అనే ప్రశ్నతో డాక్టర్ ముట్నూరి తన ఉపన్యాసాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎండీ అక్తర్ ఖాన్, డాక్టర్ నికుల్ జాని, డాక్టర్ వి.హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

మడూరు సొసైటీ కార్యాలయానికి తాళం వేసి సభ్యుల నిరసన



మడూర్ సొసైటీకి తాళం వేసి ఆందోళన చేస్తున్న రైతులు

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మడూర్ సొసైటీ సీఈవో అవకతవకలపై విచారణకు సమయం మించిపోతున్నా అధికారులు రాకపోవడంతో ఆగ్రహించిన సభ్యులు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కార్యాలయానికి తాళం వేసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సొసైటీలో 18 మంది సభ్యులు రుణమాఫీకి అర్హులైనప్పటికీ సీఈవో నిర్వాహకంతో వర్తించలేదన్నారు. 2016 నుంచి 2024 వరకు విడుతల వారీగా రుణాలు పొందగా, రుణమాఫీ జాబితాను ఆన్‌లైన్‌లో పొందుపరుచలేదని మండిపడ్డారు. కొంత మంది పేరున ఫేక్ అకౌంట్‌తో సృష్టించి రుణాలు పొందినట్లు సీఈవో అవకతవకలకు పాల్పడినట్లు కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా విచారణకు ఆదేశించరన్నారు. విచారణకు రావాల్సిన అధికారులు ఎందుకు రాలేదని బాధిత రైతులు మండిపడ్డారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ప్రత్యేకమా.. పొడగింపా?

(5వ పేజీ తరువాయి)

గడువును పొడగిస్తుందా.. లేక స్పెషలాఫీసర్ల పాలనకే ఆసక్తి చూపుతుందా అనే నిర్ణయం ప్రభుత్వం చేతిలో ఉంది.

స్పెషలాఫీసర్ల నియామకానికి అధికారుల కసరత్తు

ప్రత్యేక పాలనకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు. అయితే పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌లకు ప్రభుత్వం ఇప్పటికే స్పెషలాఫీసర్లను నియమించిన సంగతి తెలిసిందే. సహకార సంఘాలకు సైతం అదేవిధంగా ప్రత్యేకాధికారుల పాలనకే మొగ్గుచూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల సహకారశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఎంపీడీవో, తహసీల్దార్ స్థాయి అధికారులను సొసైటీలకు ప్రత్యేకాధికారులుగా నియమించవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఒక్కో సొసైటీకి ఒక్కో ప్రత్యేకాధికారిని నియమిస్తారా.. లేక రెండు, మూడు సొసైటీలకు నియమిస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది.

ఉమ్మడి జిల్లాలో సహకార సంఘాలు ఇలా..

మెదక్‌లో 53 సహకార సంఘాల పరిధిలో 76,765 మంది సభ్యులు ఉన్నారు. కొత్తగా 29 సొసైటీలు ఏర్పాటు చేయాలని జిల్లా అధికారులు ప్రతిపాదించారు. సంగారెడ్డి జిల్లాలో 53 సంఘాలు ఉండగా వీటిలో 71,556 మంది సభ్యులు ఉన్నారు. సిద్దిపేట జిల్లాలో 21 సంఘాల్లో 67,200 మంది సభ్యులు ఉన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆయా జిల్లాల పరిధిలో కొత్తగా సహకార సంఘాల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు తెప్పించుకుంది. కొత్తగా జిల్లాలు ఏర్పడి ఎనిమిదేళ్లవుతున్నా ఆయా జిల్లాలకు ప్రత్యేకంగా డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రస్తుతం ఉమ్మడి జిల్లాకు సంగారెడ్డి కేంద్రంగా ఉన్న డీసీసీబీనే కొనసాగిస్తున్నారు. కొత్త సంఘాలతో పాటు కొత్త బ్యాంకులు ఏర్పాటు చేస్తారా అనే విషయంపై స్పష్టత లేదు.

అంతర్జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనకు కన్‌సాన్‌పల్లి విద్యార్థి



ఎగ్జిబిట్‌తో స్రవంతి, గైడ్ టీచర్ సిద్దేశ్

జోగిపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): త్వరలో జపాన్‌లో జరగనున్న అంతర్జాతీయ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు జోగిపేట మండలం కన్‌సాన్‌పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని స్రవంతి ఎగ్జిబిట్ ఎంపికైంది. స్రవంతి రూపొందించిన డెస్క్ లిఫ్టర్ ఎగ్జిబిట్ ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రదర్శించగా, అంతర్జాతీయ స్థాయికి ఎంపిక చేశారు. త్వరలో జపాన్ దేశంలో నిర్వహించనున్న సకురా ప్రదర్శనలో ఎగ్జిబిట్‌ను ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి స్రవంతి, గైడ్ టీచర్ సిద్దేశ్‌ను కలెక్టర్ క్రాంతి వల్లూరు, డీఈవో వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి సిధారెడ్డి అభినందించారు.

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని గిరిపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బండారు రవీందర్(35)కు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. కుటుంబ పోషణ, పంటల సాగుకు సుమారు రూ. 4.5 లక్షల వరకు అప్పులయ్యాయి. వీటిని తీర్చే మార్గంలేక తీవ్ర మనోవేదనకు గురైన రవీందర్ సోమవారం తమ వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కుకునూరుపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన కుకునూరుపల్లి మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గురువన్నపేట గ్రామానికి చెందిన బచ్చలి సత్తయ్య సోమవారం తన ద్విచక్రవాహనంపై కుకునూరుపల్లికి వచ్చి బస్టాండ్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా హైదరాబాద్ వైపు వెళ్తున్న వాహనం ఢీకొనడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అంతకు ముందు కుకునూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన ఏఎన్ఎం మరియా, నాగలక్ష్మీ విధులు ముగించుకొని బస్సు కోసం వేచి ఉండగా అదే సమయంలో ప్రమాదం జరగడంతో అంబులెన్స్ వచ్చే లోపు క్షతగాత్రుడికి ప్రథమ చికిత్సను అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.

మరో ఘటనలో ఇద్దరికి..

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రెండు బైకులు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని పిడిచెడులో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం అహ్మదీపూర్‌కు చెందిన వ్యక్తి బైక్‌ని పిడిచెడ్‌కు చెందిన మరో వ్యక్తి బైకుని పిడిచెడ్ వెళ్లే మార్గమధ్యలో వెనుక నుంచి ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న గజ్వేల్ 108 సిబ్బంది పైలట్ శ్రీకాంత్, ఈఎంటీ వర్షిత క్షతగాత్రులను గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం లక్ష్మక్కపల్లిలోని ఆర్‌వీఎం ఆసుపత్రికి తరలించారు.

25 మందికి జరిమానా

గజ్వేల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన పలువురికి గజ్వేల్ అదనపు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించింది. కొన్ని రోజుల క్రితం గజ్వేల్ పట్టణంలోని ఆయా చౌరస్తాలలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 25మంది పట్టుబడ్డారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపరచగా, విచారణ చేపట్టిన న్యాయమూర్తి 25మందికి రూ.12,500 జరిమానా విధించారని గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళీ తెలిపారు.

● సిద్దిపేట క్రైం : సిద్దిపేటలో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్, టూ టౌన్ సీఐ ఉపేందర్ ఆధ్వర్యంలో కొన్ని రోజులుగా నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 17 మంది పట్టుబడ్డారు. వారిని సోమవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపరచగా విచారణ చేపట్టి 17 మందికి రూ.25,500 జరిమానా, ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధించారు.

మహిళకు రిమాండ్

బెజ్జంకి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మహిళను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. హుస్నాబాద్ ఎక్సైజ్ సీఐ పవన్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని చిలాపూర్ పరిధిలోని వడ్డెర కాలనీకి చెందిన సంపంగి అరుణ గతంలో గుడుంబా అమ్ముతూ పట్టుపడగా బెజ్జంకి తహసీల్దార్ ఎదుట ఎక్సైజ్ పోలీసులు బైండోవర్ చేశారు. ఈ నేపథ్యంలో బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి సిద్దిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గుడుంబా విక్రయిస్తూ ఆమె మరోసారి పట్టుబడింది. దీంతో ఆమెను అదుపులోకి తీసుకున్న పోలీసులు సోమవారం బెజ్జంకి తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ఎదుట హాజరుపరిచారు. ఆయన ఆదేశాల మేరకు అరుణను రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ ఎస్ఐలు రూప, దామోదర్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



పంటకు సీసీ కెమెరా రక్షణ

సాంకేతికతను రైతులు అందిపుచ్చుకుంటూ పొలాల రక్షణకు సీసీ కెమెరాలను వినియోగిస్తున్నారు. సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెల్లిలో రైతు పొద్దుతిరుగుడు చేనుకు సౌర విద్యుత్‌తో నడిచే కెమెరాలు ఏర్పాటు చేశాడు. పొద్దు తిరుగుడు పంట వద్దకు ఎవరైనా అపరిచితులు వస్తే వెంటనే పంట యజమానికి అలారం రూపంలో సిగ్నల్స్ పంపి అప్రమత్తం చేస్తుంది.

-సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటో గ్రాఫర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి

కొర్రీ.. వర్రీ..



- కందుల కొనుగోలులో కిరికిరి
- నిబంధనలతో పేరుతో నిరాకరణ
- విస్తీర్ణానుసారం సేకరణతో తంటాలు
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు

చేర్యాల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కందుల కొనుగోలులో నిబంధనల పేరిట లేనిపోని కిరికిరి పెడుతున్నారంటూ అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యమో, సమాచారలోపమోగానీ పలువురు రైతులు కంది పంట సాగు విస్తీర్ణం వివరాలను సక్రమంగా ఆన్‌లైన్‌లో నమోదుకాలేదు. తద్వారా ప్రస్తుతం కందుల కొనుగోలు తీవ్ర ఇబందులు ఎదురవుతున్నాయి. చేర్యాల పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతుల నుంచి మద్దతు ధరకు కందులను సేకరించేందుకు చేర్యాల పీఏసీఎస్ చైర్మన్ మేరుగు కృష్ణ పాలకమండలితో చర్చించి వ్యవసాయ మార్కెట్‌యార్డులో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. పోటీ రాజకీయంతో గతనెల 18న జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, అనంతరం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. క్వింటాలు రూ.7500 మద్దతు ధర నిర్ణయించారు. దీంతో రైతులు నిర్ణిత తేమ శాతానికి అనుగుణంగా కందులను ఆరబెట్టుకుని, చెత్త, రాళ్లు లేకుండా తూర్పార పట్టుకుని విక్రయానికి సిద్ధం చేశారు. కానీ ఆన్‌లైన్‌లో నమోదుచేసుకున్న పంట విస్తీర్ణాన్ని బట్టి కొనుగోలు చేస్తామని తెలుపడంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. సాధారణంగా నీటి వనరుల లభ్యతానుగుణంగా ఎకరాకు 3-6 క్వింటాళ్ల కందుల దిగుబడి వస్తుంది. కానీ ప్రామాణికత ప్రకారం ఎకరాకు మూడు క్వింటాళ్లు మాత్రమే కొంటామని చెబుతుండటంతో మిగతా కందులు ఎవరికి విక్రయించాలో తెలియక అన్నదాతలు తలలు పట్టుకుంటున్నారు. ఇక ఆన్‌లైన్‌లో నమోదు పొందని రైతులు ఎటూపాలుపోలేని దుస్థితిలో కొట్టుమిట్లాడుతున్నారు. ఆయా నిబంధనలలు సడలించి అందరి కందులు కొనుగోలు చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. రోజులు గడుస్తున్నా ఎలాంటి సమాధానం చెప్పేవారు లేక దిగాలు చెందుతున్నారు. ఇటీవల జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఆశ్రయించి గోడువెళ్లబోసుకోగా స్పందించిన ఆయన సంబంధిత ఉన్నతశాఖ అధికారులతో మాట్లాడారు. అయినా అధికారుల్లో ఎలాంటి చలనం లేకపోవడంతో రైతులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

15 రోజులుగా పడిగాపులు కాస్తున్నాం



నాకు, మాతండ్రి పేరున ఉన్న 5ఎకరాలలో కందులు పండించాం. ఆన్‌లైన్‌లో నాపేరున ఉన్న సుమారు మూడున్నర ఎకరాల విస్తీర్ణం మాత్రమే నమోదైంది. విస్తీర్ణం తక్కువగా నమోదైందన్న కారణంగా మొత్తం కందులు కొనుగోలు చేయమని చెబుతున్నారు. ఆన్‌లైన్ రిపిస్ట్ వస్తలేదంటున్నారు. 15 రోజులుగా పడిగాపలు కాస్తున్నాం.

-సూర్న కనకయ్య, వీరన్నపేట

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

సాగు విస్తీర్ణం ఆన్‌లైన్ నమోదు కాకపోవడంతో సమస్య తలెత్తింది. రైతులందరి ఇబ్బందుల దృష్ట్యా నిబంధనల సడలింపుతో కందుల కొనుగోలు చేపట్టేందుకు అన్నిరకాల ప్రయత్నిస్తున్నాం. మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సాగు విస్తీర్ణం నమోదుకు సంబంధించి వ్యవసాయ అధికారులను సంప్రదిస్తున్నాం.

-మేరుగు కృష్ణ, పీఏసీఎస్ చైర్మన్



మాట్లాడుతున్న సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దుకుందాం

● సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దుకుందామని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ తెలిపారు. సోమవారం సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పలు వాణిజ్య వ్యాపారస్తులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వాణిజ్య, వర్తక వ్యాపారస్తులు ప్లాస్టిక్ వినియోగాన్ని మానుకోవాలన్నారు. వాటికి ప్రత్యామ్నాయంగా ఏకో కవర్‌లను వినియోగించాలన్నారు. ప్రజలు సైతం మార్కెట్, మాంస దుకాణాలకు వెళ్లినప్పుడు వెంట బట్ట సంచులు, స్టీల్ టిఫిన్ బాక్సులు తీసుకెళ్లాలని సూచించారు. ఇప్పటికే పట్టణంలో ప్లాస్టిక్ వినియోగం చాలావరకు తగ్గుముఖం పట్టిందని, పూర్తిస్థాయిలో నిషేధించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్లాస్టిక్‌పై తనిఖీలు నిర్వహించి పట్టుబడితే జరిమానాలు విధిస్తున్నామన్నారు. ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం

● మల్లన్న ఆలయంలోని బుకింగ్ కార్యాలయం వద్ద రేకుల షెడ్డు ఏర్పాటు

చేర్యాల, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయ సందర్శనార్థం వచ్చిన భక్తులకు బుకింగ్ కార్యాలయ ఆవరణలో ఎట్టకేలకు శాశ్వత ప్రాతిపదికన నీడ సౌకర్యం కల్పించారు. ఈ మేరకు ఆలయ అధికారులు రేకుల షెడ్డు ఏర్పాటు చేశారు. ఏటా తాత్కాలికంగా తడకపందిళ్ల ఏర్పాటుతో వేలాది రూపాయలు వృథా అవుతున్నాయే తప్ప ఆశించిన ప్రయోజనం చేకూరడం లేదు. ప్రస్తుతం జాతర కొనసాగుతున్న నేపథ్యంలో నీడ సౌకర్యం కల్పించకపోవడంతో భక్తులు పడుతున్న ఇబ్బందుల విషయమై ఇటీవల ఆంధ్రజ్యోతిలో 'నీడేది' శీర్షికన ప్రత్యేక కథనాన్ని ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఆలయ అధికారులు రేకుల షెడ్డును ఏర్పాటు చేశారు.

పూలమాలతో నిండిన గంగిరేగుచెట్టు

భక్తులు తమ కష్టాలు తొలగిపోవాలని, కోరికలు నెరవేర్చమని వేడుకుంటూ ఆలయ ప్రాంగణంలో మహిమాన్వితమైన గంగిరేగుచెట్టుకు ముడుపులు కట్టడం ఆనవాయితీ. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నాలుగు వారాల జాతరలో భక్తులు గంగిరేగుచెట్టుకు భారీగా ముడుపులు కట్టారు. పూలమాలలు అలంకరించారు. దీంతో గంగిరేగుచెట్టు ముడుపులు, పూలమాలలతో నిండి నిండుగా దర్శనమిస్తుంది.



ఏర్పాటుచేసిన రేకుల షెడ్డు

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

వర్గల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ కేంద్రంలో నిర్మించిన మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో భ్రమరాంబిక, కేతమ్మ సమేత మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు వర్గల్ విద్యాధరి క్షేత్రం వ్యవస్థాపకుడు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించారు. ఉదయం పలు పూజా కార్యక్రమాలు, మధ్యాహ్నం అగ్ని గుండముల ప్రజ్వలన, భక్తులకు అన్న ప్రసాదాల పంపిణీ చేశారు. సాయంత్రం మల్లన్న స్వామివారికి బోనాలు, బండ్ల ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాలు యాదవ్, యాదవ సంఘం నాయకులు పెద్ద గొల్ల యాదయ్య, మల్లేష్ యాదవ్, శ్రీశైలం, పుల్లయ్య, బాలమల్లు యాదవ్, భిక్షపతి యాదవ్‌తో పాటు తదితరులు ఉన్నారు.



చంద్రశేఖర శర్మ సిద్ధాంతిని సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుపై విచారణ



పోతిరెడ్డిపల్లిలో విచారణ చేస్తున్న హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్

చేర్యాల, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : చేర్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఇటీవల నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు విషయమై సోమవారం హుస్నాబాద్ ఏసీపీ సతీశ్ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారు, ఆరోపణలు ఎదుర్కుంటున్న వ్యక్తుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రతి ఒక్కరూ తోటివారితో స్నేహపూర్వకంగా నడుచుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించకూడదని తెలిపారు. ఆయన వెంట చేర్యాల సీఐ ఎల్. శ్రీను, ఎస్ఐ నీరేశ్ ఉన్నారు.

'మహిళలు ఉపాధిలో రాణించాలి'

మద్దూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఉపాధిలో రాణిస్తూ మరో పదిమందికి జీవనోపాధి కల్పించే దిశగా ముందుకెళ్లాలని అక్షయ రూరల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ పి.రజితారెడ్డి సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. మండల సమాఖ్య ఆధ్వర్యంలో వీరికి వ్యక్తిగత రుణాలు అందించి వారి జీవనోపాధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీసీ ప్రేమలత, శిక్షకురాలు ఆర్. జ్యోతి పాల్గొన్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఆర్గనైజేషన్ డైరెక్టర్

పట్టభద్రులు నూతన ఒరవడికి శ్రీకారం చుట్టాలి

● ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ



సమావేశంలో ప్రసన్న హరికృష్ణ తదితరులు

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ సేవ చేసేందుకు వస్తున్న తనను ఆశీర్వదించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ కోరారు. జిల్లా కేంద్రంలోని మున్నూరు కాపు సంక్షేమ సంఘ భవనంలో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా పట్టభద్రులు, నిరుద్యోగులు ప్రసన్న హరికృష్ణకు మద్దతు ప్రకటించారు. అనంతరం ప్రసన్న హరికృష్ణ మాట్లాడుతూ.. ప్రొఫెసర్ ఉద్యోగానికి రాజీనామా చేసి పట్టభద్రుల హక్కుల సాధన కోసం ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు. తన 19 సంవత్సరాల ఉద్యోగ జీవితంలో ప్రతి నెలా జీతంలో నుంచి 30శాతం పట్టభద్రుల సంక్షేమానికి వినియోగించానన్నారు. పట్టభద్రుల నిరుద్యోగుల సమస్యలను వారి బాధలను దగ్గరుండి చూశానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఆలయ దుకాణాల వేలంతో రూ.4.25 లక్షల ఆదాయం

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : నారాయణరావుపేట మండలం కేంద్రంలోని శ్రీ బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయ దుకాణాలకు సోమవారం బహిరంగ వేలం నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ బాగన్న కరుణాకర్ ముదిరాజ్ తెలిపారు. కొబ్బరి కాయాలు, సైకిల్ పార్కింగ్, లడ్డూ, పూలీహోర, నూనే గురుగులు తదితర నిర్వహణకు నిర్వహించిన వేలంలో ఆలయానికి రూ.4.25లక్షల అదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, ఈవో శ్రీధర్‌రెడ్డి, ఆలయ అర్చకులు సీతారామ శర్మ, డైరెక్టర్లు బిట్ల శ్రీనివాస్, ఆకుల సంతోష్ ఉప్పలయ్య గౌడ్, సరళ, దేవారాజు, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరుస మరణాల మోతే

● సోమవారం ఒక్కరోజు ఐదుగురు మృతి
● ఇటీవల కాలంలో 15 మంది వరకు ఆత్మహత్య

మిరుదొడ్డి, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతే గ్రామంలో ఇటీవల వరుస మరణాలు చోటుచేసుకుంటున్నాయి. సోమవారం ఒక్కరోజే ఐదుగురు వివిధ కారణాలతో మృతి చెందడంపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. అనారోగ్యంతో గ్రామానికి చెందిన దేవుని మల్లవ్వ(79), గోత్రాల బాలకిష్టయ్య(60) మృతిచెందారు. అలాగే చిలుక మల్లేశం అనే వ్యక్తి ఆరు నెలల క్రితం చనిపోయాడని చుట్టాలంతా వచ్చి చూడగా, అనుహ్యంగా ఆయన తిరిగి లేవడంతో ఆరోగ్యం బాగుపడిందని భావించారు. కాగా, ఆయన సోమవారం గుండెపోటుతో మరణించాడు. పెద్దచెరువులో పడి కాలేరు వెంకటేశం మృతిచెందగా, నరసవ్వ అనే మహిళ కూడా సోమవారమే మృతిచెందింది. మృతుడు బాలకిష్టయ్య కుమారుడు ఆరు నెలల క్రితం అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఇటీవల గోత్రాల జ్యోతి (32) అనే మహిళ ఆత్మహత్య చేసుకున్నది. ఇలా దాదాపు 15మంది వరకు వివిధ కారణాలతో ఆత్మహత్య చేసుకున్నారు. వీరి బలవన్మరణానికి కారణం ప్రధానంగా అప్పులే అని తెలుస్తున్నది. గ్రామంలో 2200 జనాభా ఉండగా, ఏదో ఒక్క గల్లిలో పాడే లేవడంతో గ్రామస్థులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.



ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవంలో ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి

కాంగ్రెస్‌కు సద్బుద్ధి కలగాలే

● దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వానికి దేవదేవుడు సద్బుద్ధిని ప్రసాదించి, దుబ్బాకలో కాలువల నిర్మాణం పూర్తిచేయించి సుభిక్షంగా వెలిగేలా చూడాలని కోరుకుంటున్నాననీ దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి వాఖ్యానించారు. సోమవారం తన స్వగ్రామం పోతారంలో నిర్మించిన మహాశివాలయ విగ్రహ, శివపంచాయతన శిఖర ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం మాట్లాడతూ గంగాజమునా తహజీబ్‌గా ఉన్న తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ నేతలు కులమత అసమానతలను పెంపొందిస్తున్నారన్నారు. అందులో భాగంగానే చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడిపై దాడిగా అభివర్ణించారు.

కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలి : వంటేరు

గజ్వేల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలని గజ్వేల్ బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దొంగ సర్వేలు చేసి బీసీల సంఖ్యను తగ్గించారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క కులానికి న్యాయం చేయలేకపోయిందని, రాష్ట్రంలో అసమర్థ పాలన నడుస్తుందన్నారు. ఆయన వెంట గజ్వేల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు బెండే మధు, మాజీ జడ్పీటీసీ వంగ మల్లేశం, నాయకులు తదితరులు ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

న్యూస్ బాక్స్

వీవోఏపై డీఆర్డీఏకి ఫిర్యాదు

కుకునూరుపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చిన్నకిష్టాపూర్ గ్రామానికి చెందిన విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ మంగాపై గ్రామానికి చెందిన పలువురు కలెక్టర్ కార్యాలయం, డీఆర్డీఏకు ఫిర్యాదు చేశారు. వీవోఏగా గ్రామంలో విధులు నిర్వహిస్తున్న మంగ అవినీతికి పాల్పడుతున్నారని తెలిపారు. డ్వాక్రా గ్రూపు రుణాలు మంజూరైనా డబ్బులను మహిళలకు ఇవ్వకుండా సొంత అవసరాలకు వాడుకుని, 15 రోజుల తర్వాత వారికి అందజేసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. మంజూరైన రుణాలలోనూ అవినీతికి పాల్పడుతున్న ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎన్ఎంఎంఎస్ ఫలితాల్లో జక్కాపూర్ విద్యార్థుల సత్తా

సిద్దిపేట రూరల్,ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) ఫలితాల్లో నారాయణరావుపేట మండలం జక్కాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించే ఈ పరీక్షలో పాఠశాలకు చెందిన 13 మంది అర్హత సాధించారని ప్రధానోపాధ్యాయుడు షౌకత్ అలీ సోమవారం తెలిపారు. పాఠశాలకు చెందిన ఎం.అశ్విత్‌రెడ్డి జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించినట్లు తెలిపారు. అంతేకాకుండా మొదటి పది ర్యాంకుల్లో ఐదుగురు ఈ పాఠశాల విద్యార్థులు ఉండడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

స్టడీ మెటీరియల్ అందజేత

దౌల్తాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): దొమ్మట జడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు హెచ్ఎం బాసిత్ రూ.10 వేలు విలువ చేసే స్టడీ మెటీరియల్‌లును విద్యార్థులకు సోమవారం ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో స్వయం పాలన

రాయపోల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం బేగంపేట ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవోగా అఖిల్, ఎంఈవోగా శివ, హెచ్ఎంగా వర్షిని తదితరులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, కిరణ్, సీఆర్‌పీ యాదగిరి పర్యవేక్షించారు.

తుమ్మలను కలిసిన గజ్వేల్ ఏఎంసీ చైర్మన్, పాలకవర్గం

గజ్వేల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం సభ్యులు ఆదివారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. ఖమ్మంలోని మార్కెట్ యార్డులో ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్‌తో పాటు మంత్రి తుమ్మలను కలిసి పలు అంశాలపై చర్చించారు. మంత్రిని కలిసిన వారిలో ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, డైరెక్టర్లు వహీద్, కరుణాకర్‌రెడ్డి, రామాగౌడ్, యాదగిరి తదితరులు ఉన్నారు.

రేణుకా ఎల్లమ్మను దర్శించుకున్న నాయకులు

గజ్వేల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని పిడిచెడ్‌లో రోడ్డులో కొలువై ఉన్న శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి దేవాలయ వార్షికోత్సవాలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారిని శాసన మండలి సభ్యుడు డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్లు గాడిపల్లి భాస్కర్, ఎన్‌సీ రాజమౌళి దర్శించుకున్నారు.

జిల్లాస్థాయి ప్రతిభ పరీక్ష

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా కేంద్రంలోని టీటీసీ భవన్‌లో ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి భౌతిక రసాయన శాస్త్ర ప్రతిభ పరీక్ష నిర్వహించారు. 26 మండలాల నుంచి మండల స్థాయిలో మొదటి మూడు స్థానాలు పొందిన విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ (ఎఫ్‌పీఎస్‌టీ) నిర్వహించిన టాలెంట్ టెస్ట్ ఆన్‌లైన్‌లో నిర్వహించడం బాగుందన్నారు. పదో తరగతిలో మంచి మార్కులు తెచ్చుకుని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. ఈసారి పదోతరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో జిల్లా ముందుండాలన్నారు. సమావేశంలో సెక్టోరియల్ అధికారి రామస్వామి, జిల్లా పరీక్షల విభాగం అధికారి షౌకత్ అలీ, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, ఎఫ్‌పీఎస్‌టీ ఫోరం బాధ్యులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

మర్కుక్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వరదరాజ్‌పూర్ గ్రామంలోని వరదరాజుల స్వామి దేవాలయంలో పూజారుల కుటుంబానికి చెందిన నల్ల తీగ లక్ష్మమ్మ(90) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న మండల మాజీ ప్రజాప్రతినిధులు ఎంపీపీ పాండుగౌడ్, జడ్పీటీసీ మంగమ్మ రామచంద్రం, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, గ్రామానికి చెందిన దుర్గారెడ్డి, మృతురాలి కుమారులైన వర్దాచారి గోపాలచారి, పురుషోత్తమచారిలను సోమవారం పరామర్శించారు. అనంతరం వారికి రూ. 15 వేల ఆర్థిక సహాయం అందజేశారు. పరామర్శించిన వారిలో మండల కోఆప్షన్ సభ్యుడు లక్కాకుల సాహెరా నరేష్, మాజీ ఉపసర్పంచ్ మహేష్, కనకయ్య, నాగేష్ తదితరులు ఉన్నారు.